మట్టి విగ్రహాలనే పూజిద్దాం

- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం
- పీవోపీ ప్రతిమలను వ్యతిరేకిద్దాం



మట్టి వినాయక ప్రతిమలు

బుట్టాయగూడెం: వినాయక చవితి వచ్చేస్తోంది. నవరాత్రులు ఆధ్యాత్మిక వైభవాన్ని చాటనున్నాయి. అయితే అత్యధికులు పర్యావరణ హితాన్ని విస్మరిస్తున్నారు. పీవోపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్) ప్రతిమలనే ప్రతిష్ఠిస్తున్నారు. మరికొందరు ప్రకృతి ప్రేమికులుగా ప్రత్యేకత చాటుకుంటున్నారు. మట్టి, చింతపిక్కల పొడి, గోమయం, ప్రతిమలను రూపొందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ నెల 27వ తేదీన వినాయక చవితి వేడుకల ప్రారంభం నేపథ్యంలో ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలతో తయారు చేసిన విగ్రహాలనే ప్రతిష్ఠించుకుని పూజా కార్యక్రమాలు చేయాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. తొలి పూజ అందుకునే గణేషుడిని మట్టితో తీర్చిదిద్దినా, ఏ ఆకృతిలో కొలిచినా గణనాథుని దీవెనలు లభిస్తాయని గుర్తించుకుని పూజలు చేయాలని వారు సూచిస్తున్నారు.

700 వరకు ప్రత్యేక మండపాలు

పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో సుమారు 700 వరకు ప్రత్యేక పందిర్లు, మండపాల్లో ఏర్పాటు చేస్తూ వినాయక చవితి వేడుకలు నిర్వహించనున్నట్టు అంచనా వేస్తున్నారు. అయితే వీటిలో తక్కువగా పర్యావరణ హితమైనవే ఉంటున్నాయి. చిన్నచిన్న మట్టి ప్రతిమలను ఇంటింటికీ స్వచ్ఛందంగా అనేక మంది పంపిణీ చేయనున్నారు.

పీఓపీతో నష్టమే

పీఓపీ (ప్లాస్టర్ ఆఫ్ పారిస్)తో తయారు చేసిన వినాయకుని ప్రతిమలు నీటిలో కరగవు. ముడి పదార్థాలు రంగుల్లో వాడే రసాయనాలు ముప్పుగా మారతాయి. నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుంది. పీఓపీతో తయారు చేసిన విగ్రహాలను జలాశయాలు, చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల చేపలు, జలచరాలకు హాని కలుగుతాయి. మానవ నాడీ వ్యవస్థ ఊపిరి తిత్తులు, కిడ్నీలపై ప్రభావం చూపుతాయి. చర్మవ్యాధులు, ప్రమాదకర క్యాన్సర్‌లకు దారి తీస్తుంది. కృత్రిమ రంగులతో బురదలో మేలు చేసే క్రిములు చనిపోతాయి.

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం



పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఏటా వినాయక చవితి సందర్భంగా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ప్రజలకు ఉచితంగా అందిస్తున్నాం. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే వినాయకుని విగ్రహాలు, ప్రతిమలు హానికరమైన రసాయనాలను కలిగి ఉండడం వల్ల పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుంది. దీనిపై ప్రజల్లో అవగాహన కలిగిస్తున్నాం.

– కొండేపాటి రామకృష్ణ, బుట్టాయగూడెం

సంకల్పంతో సాధ్యమే



పర్యావరణ హితమైన మట్టి ప్రతిమల ఏర్పాటుకు ప్రతీ ఒక్కరూ సంకల్పించుకోవాలి. నేల, నీటి కాలుష్యానికి కారణమయ్యే ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసే విగ్రహాలు, ప్రతిమలపై కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కలిగించాలి.

– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు

వైఎస్సార్‌సీపీ పరిశీలకునిగా చిటికెన


చిటికెన శ్రీనివాస్

కొయ్యలగూడెం: రాష్ట్రంలోని రెండు జిల్లాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కమిటీల ఏర్పాటును వేగవంతం చేసేందుకు పరిశీలకునిగా అధిష్ఠానం తనను నియమించిందని చిటికెన శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు. పార్టీ రాష్ట్ర పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్, పార్టీ పోలవరం ఇన్‌చార్జి తెల్లం బాలరాజు సూచనలతో తనను నియమించారని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల పరిధిలోని నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి కమిటీల నియామకాలు సత్వరమే చేయాల్సి ఉందని తెలిపారు. పార్టీ ఆయా జిల్లాల, మండలాల అధ్యక్షులతో చర్చించి కమిటీలను నియామకం పూర్తి చేస్తామని పేర్కొన్నారు.

విజయరాజును కలిసిన బాబి


విజయరాజును కలిసిన మల్నీడి బాబి, నాయకులు

జంగారెడ్డిగూడెం: వైఎస్సార్‌సీపీ చింతలపూడి కోఆర్డినేటర్ కంభం విజయరాజును రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి మల్నీడి బాబి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు ఈ పదవి రావడానికి సహకరించిన విజయరాజు, జిల్లా అధ్యక్షులు దూలం నాగేశ్వరరావు, రీజనల్ కోఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ, జిల్లా పరిశీలకులు వంకా రవీంద్ర, మచిలీపట్నం పరిశీలకులు జెట్టి గురునాథరావు, మండల కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రకు బాబి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసే వరకు కృషి చేస్తానని చెప్పారు. బాబి వెంట నాయకులు దల్లి మోహన్‌రెడ్డి, గాది రాము, తానిగడప రామకృష్ణ, కంభపు అప్పలరెడ్డి, బుసదుర్గాప్రసాద్, ముమ్మడి దుర్గారావు, చిక్కాల సాయి కుమార్ ఉన్నారు.

ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

టి.నరసాపురం: పామాయిల్ గెలలు నరుకుతూ విద్యుత్ వైర్లు తగిలి చనిపోయిన దోమతోటి అంజయ్య కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు గూడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. బొర్రంపాలెంలో ఓ రైతు తోటలో గెలలు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై పామాయిల్ గెలకోత కార్మికుడు అంజయ్య మృతి చెందాడన్నారు. గడచిన నెల రోజుల్లో టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, చింతలపూడిలో గెలలు కోస్తూ నలుగురు కార్మికులు చనిపోయారని తెలిపారు. వీరికి పామాయిల్ కర్మాగారాలు ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ద్వారా పామాయిల్ గెలలు నరికే కార్మికులకు కనీసం రూ.25 లక్షల పరిహారం ఇప్పించాలని, విద్యుత్ శాఖ నుంచి మరో రూ.25 లక్షలు బాధిత కుటుంబాలకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌సీపీ ధర్మాజీగూడెం అధ్యక్షుడిగా గోపి


వైఎస్సార్‌సీపీ ధర్మాజీగూడెం నూతన కార్యవర్గం

లింగపాలెం: వైఎస్సార్‌సీపీ ధర్మాజీగూడెం అధ్యక్షుడిగా ఉప్పలపాటి వేణుగోపాలరావు (గోపి) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ గ్రామ అబ్జర్వర్, కలరాయనగూడెం సర్పంచ్ చల్లగొల్ల రవిబాబు ఆధ్వర్యంలో పార్టీ గ్రామ కమిటీ పార్టీ లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు ప్రకటించారు. కమిటీ ప్రధాన కార్యదర్శులుగా ఆలూరి సోమేశ్వరరావు, బందిల వెంకటేశ్వరరావు, తాళ్లూరు సోమరాజు, మేకల శంకర్, కార్యదర్శులుగా సొంగ నాగేంద్రబాబు, గుండె మెడ శ్రీనివాసరావు, వరిగంజి హరిబాబు, మాయ వెంకట సత్యనారాయణ, షేక్ నవాబ్ జానీలు ఎన్నికయ్యారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని నూతన కార్యవర్గం పేర్కొంది.

వైఎస్సార్‌సీపీ ధర్మాజీగూడెం యూత్ కమిటీ ఎన్నిక

వైఎస్సార్‌సీపీ ధర్మాజీగూడెం యూత్ అధ్యక్షుడిగా చిట్లూరి నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ధర్మాజీగూడెంలో జరిగిన పార్టీ సమావేశంలో యూత్ కార్యవర్గాన్ని ఎన్నుకొన్నట్టు పార్టీ యూత్ మండల అధ్యక్షుడు చీదరాల ప్రసాద్ ప్రకటించారు. యూత్ ప్రధాన కార్యదర్శిగా మేకల వరప్రసాద్, నూతలపాటి కనకరాజు, కార్యదర్శులుగా పరసా ప్రభాకర్, షేక్ హుస్సేన్‌లు ఎన్నికయ్యారు. పార్టీ పటిష్టతకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు.

సొసైటీల్లో ఎరువుల నిల్వల పరిశీలన

సాక్షి స్పందన


పురుగు మందును పరిశీలిస్తున్న అధికారులు

పోలవరం రూరల్: పోలవరంలోని ఐదు సొసైటీలకు ఎరువుల సరఫరా, సరుకు నిల్వల పరిస్థితిపై మంగళవారం తహసీల్దార్ ఆర్.సాయిరాజు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబులు తనిఖీ చేశారు. మంగళవారం సాక్షి పత్రికలో కృష్ణారావుపేట పీఏసీఎస్‌లో యూరియా కోసం పాట్లు అనే శీర్షికపై ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. సొసైటీల్లో యూరియా 25 మెట్రిక్ టన్నులు, నానో యూరియా 600 లీటర్లు, డీఏపీ 18 మెట్రిక్ టన్నులు, సింగిల్ సూపర్ పాస్ఫేట్ 45 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ 238 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కృష్ణారావుపేట సొసైటీలో రైతులకు నానో యూరియా ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించామన్నారు. పంట నాట్లు వేసిన తదుపరి 25 రోజుల తరువాత పంట పూత సమయానికి ముందు వరకు నానో యూరియా వాడాలని సూచించారు. నానో యూరియా బాటిల్ ఒక బస్తా యూరియాతో సమానమని తెలిపారు. యూరియా నీటిలో కలిపి స్ప్రేయింగ్ చేయాలని, దీంతో మొక్క నేరుగా నత్రజని పోషకాన్ని మొక్క అంతా వ్యాప్తి చెందుతుందని వివరించారు. నానో యూరియా వాడటం వల్ల ఆవిరి రూపంలో నష్టపోయిన నత్రజనిని అరికట్టవచ్చన్నారు. మొక్క త్వరగా పెరుగుతుందని తెలిపారు. న్యూట్రియంట్ యూజ్ ఎఫియన్సీ ప్రకారం దాదాపు మనం వినియోగించే మందులు 80 శాతం వరకు మొక్క తీసుకుంటుందని అన్నారు. పంట దిగుబడి నాణ్యమైన ఉత్పత్తి సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కృష్ణారావుపేట సొసైటీ అధ్యక్షుడు కొణతాల ప్రసాద్, డైరెక్టర్లు మిరియా చంటి, వెంకట్రావు, పాత పట్టిసీమ సొసైటీ అధ్యక్షుడు నులకాని రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

బాబు మోసంపై విస్తృత ప్రచారం


క్యూఆర్ కోడ్ పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

లింగపాలెం: సూపర్ సిక్స్ తదితర హామీలతో ప్రజానీకాన్ని చంద్రబాబు చేసిన మోసాన్ని ప్రతి గడపకు తెలియజేయాలని వైఎస్సార్ సీపీ లింగపాలెం మండల అధ్యక్షుడు అన్నపనేని శాంతారావు అన్నారు. మంగళవారం ధర్మాజీగూడెంలో బాబు ష్యూరిటీ – మోసం గారంటీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అధికార దాహంతో చంద్రబాబు మోసపూరిత హామీలిచ్చి ప్రజలను మాయ చేస్తున్నారని ఆరోపించారు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలకు వైఎస్సార్ సీపీ చేరువైందని, పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. అధికారం చేపట్టిన మొదటి ఆరు నెలల్లోనే సంక్షేమ పథకాలను అమలు చేసి చూపిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కుతుందని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ మాజీ అధ్యక్షులు ఉప్పలపాటి వరప్రసాద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి జగన్, మండల వైస్ ఎంపీపీ మట్ట సురేష్, రాష్ట్ర లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగ సందీప్, జిల్లా విజిలెన్స్, మోనిటరింగ్ కమిటీ సభ్యులు భూపతి పుల్లయ్య, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు చీదరాల ప్రసాద్, పార్టీ లింగపాలెం మండల ఎగ్జిక్యూటివ్ సభ్యులు ఉప్పు పెద్దోడు, వనమాల సూరి, ముస్లిం మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు షేక్ పెరవలి, పార్టీ గ్రామ మాజీ అధ్యక్షుడు మేకల రాజు, నాయకులు నూతలపాటి శ్రీను, టి.మధు, స్థానిక కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

25న ఉపాధ్యాయుల మహాధర్నా


పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

చింతలపూడి : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మెమో నంబర్ 57 ప్రకారం 2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈనెల 25న విజయవాడ ధర్నా చౌక్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఉపాధ్యాయ జేఏసీ మండల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మహాధర్నా వాల్‌పోస్టర్‌ను స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం విడుదల చేశారు. చింతలపూడి, టి.నరసాపురం ఉపాధ్యాయ సంఘాల నాయకులు ధర్నాలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో చింతలపూడి, టినర్సాపురం మండల ఉపాధ్యాయ జేఏసీ నాయకులు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ విడుదల

జంగారెడ్డిగూడెం: సీపీఎస్ విధానం అమలైన రోజు సెప్టెంబర్ 1న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏపీ సీపీఎస్‌సీపి రాష్ట్ర కార్యదర్శి ఆర్ నాగదుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలంలో సీపీఎస్ సమస్యకు పరిష్కారం చూపుతామని చెప్పి, నేడు ఉద్యోగులతో కనీసం ఒకసారి కూడా సమావేశం నిర్వహించలేదని ఆరోపించారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించలేదని, కనీసం ఒక్క డీఏ కూడా విడుదల చేయలేదని వాపోయారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవీ శ్యాంబాబు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఐవీ రత్నం, యూటీఎఫ్ మండల కార్యదర్శి టి.రామకృష్ణ, బీటీఏ రాష్ట్ర నాయకులు బి.రామారావు, మండల అధ్యక్షుడు కె.రాజా, ఎన్ ఏసురత్నం, పవన్ కుమార్, నాగార్జున, స్వర్ణలత , సుభాషిణి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం


యజమానులకు శిక్షణ ఇస్తున్న వెంకటేష్

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలనుకుంట బయో రిసోర్స్ సెంటర్ (బీఆర్సీ)లో యజమానులకు తొలిరోజు శిక్షణ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ వెంకటటేష్ మంగళవారం ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతు సాధికార సంస్థ (ఆర్‌వైఎస్ఎస్) ద్వారా జాతీయ ప్రకృతి పద్ధతి వ్యవసాయం (ఎన్ఎమ్ఎన్ఎఫ్) పథకం కింద ఈ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకృతి వ్యవసాయాన్ని, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. ఏటా 3.5 లక్షల మంది రైతులను ప్రకృతి వ్యవసాయంలోకి తీసుకురావడమే లక్ష్యంగా రైతు సాధికార సంస్థ పనిచేస్తోందన్నారు. ఎన్టీఆర్, ఏలూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి పాల్గొన్న 50 మంది బీఆర్సీ యజమానులకు రాష్ట్రస్థాయి నిపుణులైన రిసోర్స్ ట్రైనర్లు శిక్షణ ఇచ్చారు. ఏటీఎం (ఎనీటైం మనీ మోడ్) అనే 20 సెంట్ల నమూనాను, ఏడాది పొడవునా వ్యవసాయం ద్వారా ఆదాయం పొందగలిగే విధానాలను, అంతర పంటలు, పీఎండీఎస్, 365 రోజుల గ్రీన్ కవర్ (బయోమాస్ ద్వారా మట్టిని ఆరోగ్యంగా ఉంచడం) వంటి నమూనాలను వివరించారు. ఏలూరు డీపీఎం ప్రవీణ్, బీఆర్సీ శిక్షకుడు గోపాలకృష్ణమూర్తి, ఎస్‌పీఎంయూ బృంద సభ్యులు జీవ ఉత్పత్తుల నాణ్యత, బీఆర్సీ యూనిట్ల నిర్వహణ, ప్రకృతి వ్యవసాయం వల్ల నేల, మానవ ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాలను వివరించారు.

క్రమబద్ధీకరణకు అవకాశం


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం: అనధికార లేఅవుట్లలో ఇళ్లు నిర్మించుకోవాలనుకునే వారికి క్రమబద్ధకరణకు అవకాశం కల్పించినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి గురువారం తెలిపారు. పట్టణంలో అనధికార లేఅవుట్లలో ఇళ్లు కట్టుకునేందుకు జూలై 26 నుంచి 100 రోజుల పాటు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్టు చెప్పారు. మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదించి, వారి సూచనలు అనుసరించి క్రమబద్ధీకరణ, అనుమతులు పొందాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిటికెన అచ్యుతరామయ్య, లోకారపు వెంకటేశ్వరరావు, నేకూరి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

కుక్కునూరు: ఫ్రీ బస్సు పథకం వల్ల నష్టపోతున్న ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం నెలకు రూ.10 వేలు సాయం అందించాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఏఎస్ఆర్ ఆటో యూనియన్ సమావేశం దార కృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని, రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. పోచారపు వెంకటేశ్వర్లు, శ్రీను, అశోక్, అజయ్, రాజు, మహేష్, చిరంజీవి తదతరులు పాల్గొన్నారు.

రేపు శాంతి ర్యాలీ

జంగారెడ్డిగూడెం: ఈ నెల 21న జంగారెడ్డిగూడెంలో నిర్వహించే శాంతి ర్యాలీని విజయవంతం చేయాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు అల్లు రామకృష్ణ, కార్యదర్శి టి.మధు కుమార్ మంగళవారం కోరారు. ఉదయం 10 గంటలకు స్థానిక అశ్వరావుపేటరోడ్‌లోని బాలుర హైస్కూల్ నుంచి విద్యా వికాస్ కిడ్స్ క్యాంపస్ వరకు ర్యాలీ కొనసాగుతుందని పేర్కొన్నారు.

నానో ఎరువులనే వాడాలి


ఎరువుల షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

కొయ్యలగూడెం: జీవన ఎరువులైన నానో ఎరువులనే రైతులంతా వాడాలని కేఆర్ పురం వ్యవసాయ సంచాలకులు, పీజీ బుజ్జిబాబు అన్నారు. మంగళవారం మండలంలో బోడిగూడెం, మంగపతి దేవిపేట గ్రామాలలో వ్యవసాయ శాఖ మండల అధికారి పోసారావు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కొయ్యలగూడెం, బయ్యనగూడెం గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ప్రతి దుకాణదారుడు ఎరువులను ఈపాస్ ద్వారానే విక్రయించాలన్నారు. అధిక ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకొంటామని దుకాణదారులను బుజ్జి బాబు హెచ్చరించారు. అన్నదాత సుఖీభవ నగదు రైతు ఖాతాలలో జమకాకపోతే రైతు సేవ కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.

సుందరగిరిపై పవిత్రోత్సవాలకు శ్రీకారం


పుష్పాలంకరణలో నారసింహుడు


పవిత్రాలకు ఉదగశాంతి నిర్వహిస్తున్న రుత్వికులు, పండితులు


గణపతి పూజ చేస్తున్న పండితులు, పాల్గొన్న అధికారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో దివ్య పవిత్రోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏడాది పొడవున ఆలయంలో తెలిసీ తెలియక జరిగిన తప్పుల ప్రాయశ్చిత్తం నిమిత్తం తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు స్వామివారి కీర్తిని, వైభవాన్ని మరింతగా చాటనున్నాయి. ఆలయ యాగశాలలో వేద పండితులు, అర్చకులు ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ వరుణ, అఖండ దీపస్థాపన, దీక్షాధారణ, పంచగవ్య ప్రాశన, పంచగవ్య ప్రోక్షణ, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ అంకురార్పణ చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. విహిత దేవత మండప ఆరాధనలు, పవిత్రాభిమన్త్రణ, మూల మంత్ర హోమాలు, అధివాసములు, నీరాజన మంత్రపుష్పములు, బలిహరణలు నిర్వహించారు. రాత్రి స్వామివారికి శేష వాహన సేవను కనులపండువగా నిర్వహించారు. ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో, హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ సూచనల మేరకు నిర్వహించిన ఈ వేడుకలు భక్తులకు నేత్రపర్వమయ్యాయి. కార్యక్రమాల్లో ఆలయ డీఈఓ భద్రాజీ, ఏఈఓ రమణ రాజు, సూపరింటెండెంట్ వాసా నగేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేత్రపర్వం.. శివ కల్యాణం


శివ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవం మంగళవారం నేత్రపర్వంగా జరిగింది. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని అట్టహాసంగా నిర్వహించిన ఈ వేడుక భక్తులకు కనువిందు చేసింది. మండపంలో ఏర్పాటు చేసిన వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఉంచి, అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేసి కల్యాణ తంతును ప్రారంభించారు. సుముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేశారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణలు, భక్తుల శివ నామస్మరణల నడుమ మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను కనులపండువగా నిర్వహించారు. కల్యాణ మూర్తులకు హారతులిచ్చారు. భక్తులు పాల్గొని, స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వైభవంగా పవిత్రాధివాసం

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో శ్రీనివాసుని దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా మంగళవారం పవిత్రాధివాసం కార్యక్రమాన్ని అర్చకులు వేడుకగా నిర్వహించారు. యాగశాలలో పవిత్రాలను ఉంచి, విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం చేశారు. పంచగవ్యప్రోక్షణ చేసి అగ్ని ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఆలయ ఆవరణలో పవిత్రాలను ఉంచి ప్రోక్షణ గావించారు. పవిత్రాలకు, ఉత్సవ మూర్తులకు పంచశయ్యాధివాసాన్ని అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో నిర్వహించారు. మహాశాంతి హోమం నిర్వహించారు. ఆలయ ఈఓ సత్యనారాయణ మూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మార్మోగిన హనుమన్నామ స్మరణ


స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు

జంగారెడ్డిగూడెం: స్వయంభూః శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం మంగళవారం హనుమన్నామ స్మరణతో మార్మోగింది. తెల్లవారుఝామున అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు చేశారు. స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసి, స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,27,873 సమకూరినట్టు ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు. స్వామివారిని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరావు దర్శించుకున్నారు. భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో అన్నప్రసాద వితరణ చేశామని చందన తెలిపారు.

25న అయ్యప్ప ఆలయంలో పూజలు

జంగారెడ్డిగూడెం: ఈనెల 25వ తేదీ గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేయనున్నట్టు అయ్యప్పస్వామి ఆలయ కమిటీ తెలిపింది. ఈ పూజల్లో పాల్గొనే భక్తులు రూ.316 చెల్లించి తమ పేర్లను నమోదు చేయించుకోవాలని, అన్నసమారాధన నిర్వహించాలనుకునే వారు రూ.5 వేలు చెల్లించాలని పేర్కొంది. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 6305982909లో సంప్రదించాలని సూచించింది.

లారీల ఢీ, డ్రైవర్‌కు గాయాలు


ఒకదాని వెనుక ఒకటి ఢీకొన్న లారీలు

జంగారెడ్డిగూడెం: మండలంలోని వేగవరం వద్ద జాతీయ రహదారిపై స్పీడ్ బ్రేకర్ దాటే క్రమంలో మంగళవారం రాజమండ్రి నుంచి ఖమ్మం వైపు మూడు లారీలు ఒకదాని వెనుక మరొకటి ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఒక లారీ డ్రైవర్ తలకు గాయాలయ్యాయి. బాధితుడిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

జీకే చారిటబుల్ ట్రస్ట్ ప్రారంభం

జంగారెడ్డిగూడెం: గణిత ఆనంద ప్రసాద్ సారథ్యంలో జంగారెడ్డిగూడెంలో జీకే చారిటబుల్ ట్రస్ట్‌ను పట్టణ ప్రముఖుడు మల్లాది సీతారామారావు (ఎంఎస్ఆర్) ప్రారంభించారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ట్రస్ట్ బ్యానర్‌ను విడుదల చేసి మాట్లాడారు. ట్రస్ట్ ద్వారా నిర్వహించే సేవ స్ఫూర్తిగా నిలవాలన్నారు. ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా ఆనంద ప్రసాద్, కార్యదర్శిగా చావా రమేష్‌బాబు, కోశాధికారిగా గణిత పద్మశ్రీ, సభ్యులుగా తెలగారపు ఆనంద్ కుమార్, ఈదుపల్లి కనకలక్ష్మి ఎంపికయ్యారు.